క్లుప్తంగా

ఐఎన్‌టీయూసీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు జే. శంకర్‌రావు మాట్లాడుతూ 1947లోనే ఐఎన్‌టీయూసీ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ఎన్నో హక్కులు సాధించామన్నారు. జాతీయ స్థాయిలో తమ నేత సంజీవరెడ్డి, రాష్ట్ర స్థాయిలో జనక్‌ప్రసాద్ నాయకత్వంలో యూనియన్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, గరిగే స్వామి, నాయకులు భీంరావు, కృష్ణమూర్తి, భీం రవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కోటపల్లి: మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టిన నర్సరీ పనులు, ఈజీఎస్ గ్రామసభల్లో గుర్తించిన పనులపై ఎంపీడీవో భాస్కర్ అధికారులతో చర్చించారు. ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచి, కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోనమెత్తిన సుంకరిపల్లి



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

భీమారం: మండలంలోని సుంకరిపల్లిలో బుధవారం నల్లగొండ పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉపావాస దీక్షతో ఉన్న కుటుంబాలు పోచమ్మకి పూజలు నిర్వహించారు. అనంతరం బెల్లం అన్నంతో బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

కొనసాగుతున్న సమ్మె



జన్నారం: సమ్మెలో పాల్గొన్న జేపీఎస్‌లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జన్నారం: ప్రభుత్వ ఆదేశానుసారం నాలుగు సంవత్సరాలు పనిచేశామని, ఇప్పుడు ప్రభుత్వం కార్యదర్శులను రెగ్యులర్ చేయాల్సి ఉండగా, తాత్సారం చేయడం సరికాదన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలకంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులను, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు సన్మానం



మంచిర్యాలటౌన్: ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సెవెన్‌హిల్స్ హైస్కూల్‌లో బుధవారం మంచిర్యాల మహిళా తరంగిణి, వనితా వాక్కు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలువురు జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మమత ట్రెజరర్ జ్యోత్స్న చంద్రదత్, వనితా వాక్కు ఫౌండర్ అడ్వకేట్ రంగు వేణు కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడంతో, సమాజంలో జరిగే అన్యాయాలను వెలుగులోకి తీసుకొచ్చి, న్యాయం చేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సభ్యులు పద్మ రెడ్డి, శ్రీదేవి, కవిత, సునిత, చందన, శైలజ, పద్మ, భవాని, సుజాత పాల్గొన్నారు.

రేపటి నుంచి డ్యాన్స్ కోచింగ్

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల మథర్ తెరెస్సా హైస్కూల్లో శుక్రవారం నుంచి నెల రోజుల పాటు టాలెంట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సమ్మర్ డ్యాన్స్ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు కొరియోగ్రాఫర్ సునార్కర్ రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు 9908967967నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఆటలు ఎట్లాడాలె?

- బోర్డులకే పరిమితం
- కనీస వసతులు కరువు



కన్నెపల్లి మండలం బోగట్ట శ్మశాన వాటికను ఆనుకుని ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం



వేమనపల్లిలో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన తెలంగాణ క్రీడా మైదానాలు అలంకారప్రాయంగా మారాయి. గ్రామానికో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, యువజనులకు క్రీడలపై ఆసక్తిని కలిగించి ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఏ ఒక్కచోట కూడా ఆటలు లేకుండా పోయాయి. ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. అనేక చోట్ల ఫెన్సింగ్ లేక పశువులు, పందులు క్రీడా ప్రాంగణాల్లో ఇష్టారాజ్యంగా తచ్చాడుతున్నాయి. అక్కడక్కడ కొందరు మల,మూత్ర విసర్జనకు, ఇంకొందరు రాత్రి పూట మద్యం సేవించడానికి, అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు తాండూర్, కాసిపేట, కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల, బెల్లంపల్లి రూరల్‌ల్లో క్రీడా ప్రాంగణాలు వినియోగంలో లేవు. వీటి నిర్వహణపై ప్రభుత్వ యంత్రాంగానికి కనీస శ్రద్ధ కూడా లేకపోవడంతో ఆటలు లేని క్రీడా ప్రాంగణాలుగా మారాయి.



బెల్లంపల్లి లోతట్టు ప్రాంతంలో

కాసిపేట మండలం సోమగూడెం -కేలో నిరుపయోగంగా..



నెన్నెల మండలం నందులపల్లిలో చెరువులో క్రీడా ప్రాంగణం



సుద్దాలలో వాగులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

చెన్నూర్ నియోజకవర్గంలో...

భీమారం/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/కోటపల్లి/జైపూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ఆటలు ఆడుకునేందుకు వీలుగాని చోట క్రీడా మైదానాలు ఏర్పాటు చేసి మమా అనిపించారు. చెన్నూర్ మండలం లింగపల్లిలో నర్సరీతో పాటు మూతబడిన పాఠశాల వద్ద బోర్డు ఏర్పాటు చేశారు. కనీస వసతులు కూడా లేవు. సుద్దాలలో వాగులో క్రీడా ప్రాంగణం బోర్డును ఏర్పాటు చేశారు. మందమర్రిలో జూనియర్ కళాశాల పక్కన ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు మొలిచి అధ్వానంగా ఉంది. పరికరాలు చోరీకి గురయ్యాయి. కోటపల్లి మండలంలోని వెల్మపల్లిలో క్రీడా ప్రాంగణం బోర్డుకే పరిమితం అయ్యింది. భీమారం మండలం బూర్గుపల్లిలో క్రీడా ప్రాంగణానికి దారే లేదు. దాంపూర్‌లో చెరువుశిఖంలో నిర్మించారు. వర్షం వస్తే నీటితో నిండిపోతుంది. జైపూర్ మండలం ముదిగుంట హైస్కూల్లోనే క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. వాస్తవానికి క్రీడా ప్రాంగణానికి ప్రత్యేకమైన స్థలం కేటాయించి పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, పెద్దలు వాకింగ్‌తో పాటు వ్యాయామం వంటివి చేసుకోవడానికి మంచి వాతావరణాన్ని కల్పించాల్సి ఉంది.



భీమారం: బూర్గుపల్లిలో గడ్డి మొలిచి..



మందమర్రిలో పిచ్చి మొక్కలతో...



కోటపల్లి మండలం వెల్మపల్లిలో నిరుపయోగం

రెండు గ్రామాలకు ఒకే చోట..

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ, అక్కపెల్లి గూడ పంచాయతీకి ఒకే క్రీడా ప్రాంగణంగా కేటాయించి రెండు బోర్డులు ఏర్పాటు చేశారు. అక్కపెల్లి గూడకు ప్రత్యేక స్థలం లేనందునా, అధికారుల సూచన మేరకు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ భూమేశ్ పేర్కొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



భీమారం: కొత్తపల్లిలో ప్రారంభిస్తున్న సమ్మయ్య

భీమారం: మండలంలోని కొత్తపల్లిలో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైస్ ఎంపీపీ జనంపల్లి సమ్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోధారి తిరుపతి, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి రాములు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్, సుద్దాల, నాగాపూర్, వెంకంపేట గ్రామాల్లో బుధవారం ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, పీఏసీఎస్ సీవో రత్న లక్ష్మినారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు పోలు అర్చన, అన్నల మానస, జాడి సుమలత తదితరులు పాల్గొన్నారు.

కొమ్మల కత్తిరింపునకు కత్తి పట్టిన కమిషనర్



బెల్లంపల్లి: మున్సిపాలిటీలో హరితహారం కింద రెండు, మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా ఎదుగుతున్నాయి. వీటి కొమ్మలు రోడ్డు వరకు విస్తరిస్తుండటంతో బుధవారం నరికివేత చర్యలకు సిద్ధపడ్డారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు పక్కన పెరిగిన చెట్ల కొమ్మలను నరికి వేయించడానికి మున్సిపల్ సిబ్బంది ఉపక్రమించారు. గొడ్డళ్లతో కొమ్మలు నరికి వేస్తుండగా అక్కడికి వెళ్లిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తన హోదాను పక్కన పెట్టి సిబ్బంది వద్ద ఉన్న కత్తి తీసుకుని చెట్ల కొమ్మలను నరికి వేశాడు. మున్సిపల్ కమిషనర్ కత్తి పట్టి కొమ్మలు నరకడం చూసిన పురప్రజలు, సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు.

వడదెబ్బతో జాగ్రత్త



మాట్లాడుతున్న డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి

శ్రీరాంపూర్: వేసవిలో తాకే వడదెబ్బలతో జాగ్రత్తగా ఉండాలని సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆర్కే న్యూటెక్ గనిపై బుధవారం వడదెబ్బల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలో వెళ్లేటప్పుడు తలకు టోపి, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తరచూ మంచినీళ్లు తాగాలన్నారు. పండ్ల రసాలు అధికంగా తీసుకోవాలన్నారు. వేపుడు పదార్థాలు తినరాదని, మందు, మాంసం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, సంక్షేమ అధికారి పాల్‌సృజన్, ఫిట్ ఇంజనీర్ రాజగోపాలచారి, వెంటిలేషన్ అధికారి శంకర్, ఫిట్ సెక్రెటరీ జంపయ్య, నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



రామకృష్ణాపూర్: సన్మానిస్తున్న నాయకులు



సన్మానం చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: మే డే వేడుకల్లో భాగంగా ప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్న గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, జీఎం చర్చల ప్రతినిధి పెట్టం లక్ష్మణ్‌ను బుధవారం ఎస్సార్పీ 3, 3ఏ గని అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గనిపై జరిగిన కార్యక్రమంలో ఏజెంట్ గోపాల్‌సింగ్, గని మేనేజర్ సంతోశ్‌కుమార్ వారిని శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ కేటగిరిలో ప్రమోషన్లు పొందిన ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి మహేందర్, సంక్షేమాధికారి మోహన్‌సింగ్, ఫిట్ సెక్రెటరీ రిక్కుల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: శ్రమశక్తి అవార్డు పొందిన టీబీజీకేఎస్ నాయకులు, జీఎంతో చర్చల ప్రతినిధి ఆల్వాల బాపును బుధవారం టీబీజీకేఎస్ నాయకులు, సివిల్ కార్మికులు ఘనంగా సన్మానించారు. కార్మికుల హక్కుల కోసం మరింతగా పోరాడుతూ వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, బీఆర్ఎస్ నాయకులు గాండ్ల సమ్మయ్య, సుదర్శన్ గౌడ్, నీలం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలపై ఆరా

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 6వ వార్డులో బుధవారం మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ సుంకరి శ్వేతతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో డ్రెయినేజీ లేని కాలనీ చివరి ఇళ్ల వద్ద ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. వార్డు నాయకులు సుంకరి రమేశ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నెన్నెల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన మండల కేంద్రంలోని రైతువేదికలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భూమేశ్వర్ తెలిపారు. ఆసక్తి కలిగిన దాతలు, యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆయన కోరారు. దాతలు ఆర్ఐ గణేష్‌కు 9441536969నంబర్‌ను సంప్రదించి తమ వివరాలు అందజేయాలన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎస్సై

నెన్నెల: ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్‌పటేల్ తహసీల్దార్ భూమేశ్వర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, ఒక మొక్కను అందజేశారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

టార్పాలిన్లు అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామంలోని రైతులకు, రైతు పరస్పర సహాయ సహకార సంఘంలోని సభ్యులకు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల ఆధ్వర్యంలో బుధవారం టార్పాలిన్ కవర్లను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పాతమంచిర్యాల: అఖిల భారత యువజన సమాఖ్య 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే అక్బర్, పోచన్న, మహేందర్ రెడ్డి, పొలు, మల్లయ్య పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్: పట్టణంలో చేపడుతున్న బైపాస్ రోడ్డు పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే రోడ్డును వినియోగంలోకి తీసుకొచ్చేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజయ్య, వార్డు కౌన్సిలర్లు మాదవి, పద్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు సూచనలు పాటించాలి

నెన్నెల: విద్యుత్ వినియోగదారులు భద్రత, పొదుపు సూచనలు పాటించాలని నెన్నెల విద్యుత్ ఏఈ మల్లయ్య అన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జరుగుతున్న విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నెన్నెల సబ్‌స్టేషన్ ఆవరణలో, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ తెలంగాణ లిమిటెడ్ ద్వారా విద్యుత్ భద్రత, పొదుపు సూచనలు తెలియజేసి పోస్టర్ ఆవిష్కరించారు. విద్యుత్‌భద్రత, పొదుపు విద్యుత్, ప్రమాదాల నివారణ, కెపాసిటర్ల వాడకంపై వినియోగదారులకు సూచనలు చేశారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



భూమిపూజలో పాల్గొన్న దివాకర్‌రావు

దండేపల్లి: గిరిజన గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే దివాకర్ రావు అన్నారు. దండేపల్లి మండలం మామిడిపల్లి నుంచి కంచరబాయి వరకు రూ.1.83లక్షలతో నిర్మించే బీటీరోడ్డు పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రైతు సమితీ జిల్లా కన్వీనర్ గురువయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ శిరీష, కొత్త మామిడిపల్లి సర్పంచ్ రాజయ్య, ఉపసర్పంచ్ మహేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేత్ర సమస్యల నివారణకే 'కంటి వెలుగు'



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: కంటి సమస్యలను నివారించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 32వ వార్డులో బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ఎమ్మెల్యే కంటి వెలుగును ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, కౌన్సిలర్లు రాజలింగు, కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సంబంధిత అధికారులు, వార్డుప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పేద యువతి పెళ్లికి ఆర్థికసాయం

ఓ పేదింటి యువతి పెళ్లికి ఆర్థికసాయం చేసి ఎమ్మెల్యే ఉదారతను చాటుకున్నారు. మండల కేంద్రానికి చెందిన జాడి మల్లయ్య కుమార్తె జ్యోతికి పెళ్లి నిశ్చయమైంది. ఆమె పెళ్లికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

వినతిపత్రం అందజేత

బెల్లంపల్లిరూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్ల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని గెస్ట్ లెక్చరర్లు, గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించి వెంటనే రెగ్యులైజ్ చేయాలని బుధవారం ఎమ్మెల్యే చిన్నయ్యకు వినతిపత్రం ఇచ్చారు.

కూలీలతో మమేకమై!



కూలీకి మట్టి తట్ట ఎత్తుతున్న డీసీసీ అధ్యక్షురాలు

దండేపల్లి: మండలంలోని నాగసముద్రంలో బుధవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ 'గడప గడపకూ కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ చెరువు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పని ప్రదేశానికి వెళ్లి, అక్కడి మహిళ కూలీలతో మమేకమై మాట్లాడుతూ, మట్టిని తవ్వడం, మట్టితట్టను కూలీ నెత్తికి అందించే పనులు చేశారు. కూలీలతో మాట్లాడి, వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

క్షీరాభిషేకం

చెన్నూర్‌రూరల్: గౌడ కులస్తులకు రూ.5లక్షల బీమా పథకాన్ని ప్రవేశ పెట్టినందుకు గాను మండలంలోని కిష్టంపేటలో సర్పంచ్ రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి గౌడ కులస్తులు క్షీరాభిషేకం చేశారు.